

# నవభూమి

## మెదక్

అనుబంధం

23 సెప్టెంబర్,2024 సోమవారం పేజీలు:4

www.epaper.navabhoomi.in


# 27న నంగునూరులో రైతు ధర్నా



**నంగునూరు-నవభూమి :** రైతుల సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్దిపేట జిల్లా నంగునూరు వేదికకానుంది. పంట రుణమాఫీ, రైతు బంధు, పంటలకు బోనస్ ఇవ్వకపోవటాన్ని నిరసిస్తూ మండల కేం ద్రంలో ఈనెల 27న రైతు ధర్నా నిర్వహించనున్నట్లు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం ప్రకటించారు. సన్నాహక ఏర్పాట్లపై రైతులు, బీఆర్ఎస్ నాయకులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులకు కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే రూ. 2లక్షల పంటరుణాన్ని ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. తూతూమంత్రంగా రుణమాఫీ చేసి మొత్తం చేసినట్లు డబ్బా కొట్టుకుంటుందన్నారు. రైతుల నెత్తిన వడ్డీమోపి మరింత అప్పు ల పాలు చేసిందన్నారు. 31 రకాల కొర్రీలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యలో కోతలు విధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటరుణమాఫీ విషయంలో సీఎం ఒక మాట, మంత్రి ఒక మాట మాట్లాడుతున్నారని, ఈ వ్యాఖ్యలు రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. రైతు భరోసా అని చెప్పి వానకాలం ముగుస్తున్నా దికు లేదన్నారు. పంట పెట్టుబడి సాయం అందక రైతులు కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు సన్నాలకు మాత్రమే అని చేతులు దులుపుకుందన్నారు. రైతులపై అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను దుయ్యబట్టేందుకు నంగునూరులో రైతు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

### హామీలు అమలులో కేంద్ర రాష్ట్ర

# ప్రభుత్వాలు విఫలం



**హుస్నాబాద్-నవభూమి :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, హామీల అమలులో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్, బిజెపి పార్టీలు ప్రభుత్వాలు తక్షణమే గద్దె దిగాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పోతారు గ్రామంలోని శుభం గార్డెన్లో జరిగిన హుస్నాబాద్ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమ్మేళనం నిర్వహించారు ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల తీరును ఎండగట్టి, వాస్తవాలను ప్రజలకు తెలియపరచాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని గతంలో మాదిరిగా అన్ని స్థానాలను కైవసం చేసుకునేలా ప్రతి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త కంకరబద్ధులై కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారంటీలు ఫెయిల్యూరని, 100 రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేటికీ అమలు చేయకుండా తాత్సరం చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, గ్యాస్ రాయితీ డబ్బులు లబ్ధిదారుల అకౌంట్లో పడటం లేదని, గృహలక్ష్మి ద్వారా ఇండ్లు కట్టించే కార్యక్రమం ఊసే లేదని, ఆసరా పెన్షన్లను ఎప్పుడు పెంచుతారని, రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం మలు చేయడం లేదని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళా అకౌంట్లో నెలకు రూ.2500 చొప్పున ఇస్తామన్న హామీ ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. రైతులను ఇబ్బంది పెడితే కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇతర అంశాల మీద దృష్టి పెట్టి, స్వీయ లాభం కోసం, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న వసూళ్ల పర్వాన్ని, ప్రస్తుతం ప్రజలు వాస్తవ పరిస్థితులను గమనిస్తున్నారని అన్నారు. మోసపూరిత కాంగ్రెస్ బిజెపి పార్టీల నాయకుల మాటలు వినే పరిస్థితుల్లో ప్రజలు లేరని, తెలంగాణ అస్తిత్వం కోసమే పుట్టిన బీఆర్ఎస్ పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుతమైన అఖండ విజయాన్ని అందించడానికి ప్రజలు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, శ్రేణులు, నాయకులు ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపరిచి స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీనీ గెలిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మాజీ ఎంపీపీ లకవత్ మానస, బిఆర్ఎస్ నాయకులు దుండగల రాజ్యలక్ష్మి, మండల అధ్యక్షుడు గంగం మదన్ మోహన్ రెడ్డి, అక్కన్నపేట మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిల్లుల కోసం పాడి రైతుల నిరసన



**రామాయంపేట-నవభూమి :** నిజాంపేట మండలం నార్లాపూర్‌లో శనివారం తెల్లవారుజామున విజయ డెయిరీ పాల వ్యాన్ గ్రామానికి చేరుకోగా పాడి రైతులు నిలిపేశారు. పాల డబ్బులు ఇచ్చేవరకూ ఇక్కడి నుంచి వ్యాన్‌ను కదలనివ్వమని మొండికేశారు. వ్యాన్ వెంట వచ్చిన నిర్వాహకుడిని రైతులు నిలదీశారు. రెండు నెలల 15రోజులు గడుస్తు న్నా డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత విజయ పాల డెయిరీ మేనేజర్ దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పడంతో రైతులు శాంతించారు. రెండు రోజుల్లో డబ్బులు రాకుంటే రామాయంపేట పాలశీతలీకరణ కేంద్రం వద్ద నిరసన తెలుపుతామని డిమాండ్ చేశారు.

**రైతులను పట్టించుకోవడం లేదు**

నాలుగు నెలల నుంచి పాల బిల్లులు రావడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హ యాంలో 15 రోజులకు ఒకసారి బిల్లులు ఇచ్చేవారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విజయడెయిరీని మూతపడేలా చేస్తుంది.

**పాల బిల్లులు రాక పస్తులుంటున్నాం**

సరైన సమయంలో పాల బిల్లులు రాక పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిం ది. జూలై నుంచి పాల బిల్లులు రావడంలేదు. రోజుకు 15లీటర్ల వరకు పాలను విజయ డెయిరీకి పోస్తా. ఇంత కష్టపడ్డా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకుండా జాప్యం చేస్తుంది. బర్రెల మేతకు డబ్బులు లేక అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే రెండు నెలల పాల బిల్లులను మంజూరు చేయాలి. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాల ధరను పెంచడమే గాకుండా సమయానికి ఇబ్బందులు లేకుండా బిల్లులు అందించింది.

**రోజుకు 25లీటర్ల వరకు పాలు పోస్తా..**

పదేండ్ల నుంచి రోజూ 25 టీటర్ల వర కు విజయ పాల డెయిరీకి పాలు పోస్తా. ఈ మధ్య కొత్త ప్రభుత్వం రావడంతోనే పాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పాల ధరను కేసీఆర్ ప్రభుత్వం పెంచింది. సమయానికి పాల బట్వాడాను కూడా అందజేసిం ది. ఇప్పుడు రెండు నెలల 15రోజులు గడుస్తున్నా పాల పైసలు రావడం లేదు. పశువులకు దాణా తెద్దామన్నా పాల పైసలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం వెంటనే పాడి రైతులకు డబ్బులు చెల్లించాలి లేకుంటే రామాయంపేటలోని విజయ పాలశీతలీకరణ కేంద్రం వద్ద నిరసన తెలుపుతాం.

# నిండుకుండలా మల్లన్నసాగర్

**తొగుట-నవభూమి** : సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో 21.12 టీఎంసీల నీటిని నిల్వచేసి 2024-25 సీజన్ పంపింగ్ ముగించామని ప్రాజెక్టు డీఈఈ శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఇప్పటి వరకు 18.50 టీఎంసీల గోదావరి జలాలను మల్లన్నసాగర్‌లోకి పంపింగ్ చేశామని, దీంతో ప్రాజెక్టు నిండుకుండలా మారిందని ఆయన తెలిపారు. మల్లన్నసాగర్ నుంచి 5.5 టీఎంసీల నీటిని కొండపోచమ్మ సాగర్‌కు తరలించినట్లు తెలిపారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో ఇంతకు ముందున్న 8.50 టీఎంసీల నీటికి అదనంగా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 13.00 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్లు ఆయన తెలిపారు. 2020లో మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో తొలిసారిగా పంపింగ్ ప్రారంచామని, నాలుగేండ్లలో ఇప్పటివరకు మొత్తం 60.40 టీఎంసీల నీటిని ఎత్తిపోశామన్నారు. 12వ ప్యాకేజీలో దుబ్బాక కాలువ ద్వారా నాలుగేండ్లుగా గొలుసుకట్టు చెరువుల ద్వారా 95 చొప్పున ట్యాంకులు, చెక్‌డ్యామ్‌లు నింపి మొత్తం 7.45 టీఎంసీల నీటిని సరఫరా చేసినట్లు చెప్పారు.



## కెనాల్ కాల్వ దారి రియల్ ఎస్టేట్ ఆక్రమణ



**హుస్నాబాద్-నవభూమి :** హుస్నాబాద్ పట్టణ శివారులోని మహమ్మదాపూర్ గ్రామం కు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న కెనాల్ కాలువ దారిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని బిఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం హుస్నాబాద్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో వ్యవసాయ నీటి కాలువ కొరకు 10 సంవత్సరాల క్రితం భూసేకరణ చేసి మహమ్మద్ పూర్, మడద గ్రామాలకు వెళ్లే దారి వైపు నీటి కాలువాలు ఉండేవని తెలిపారు. కానీ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు అట్టి కెనాల్ ను ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండానే మట్టితో నింపి అక్రమ వెంచర్ కు దారితీసి ప్లాట్లు చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్న పురపాలక శాఖ అధికారులు, నీటి పారుదలశాఖ అధికారులు మౌనంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే కాల్వకు అడ్డం పోసిన మట్టిని పైపులను తొలగించాలని, ఇష్ట రాజ్యాంగ పాతిన హద్దురాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శించిన మాజీ ఎంపీటీసీ



**తొగుట-నవభూమి :**వడ్డే లింగం మరణించడం చాలా బాధాకరమని మాజీ ఎంపీటీసీ కంకణాల నర్సింలు అన్నారు. ఆదివారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామాని కి చెందిన వడ్డే లింగం గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ మృతుని కుటుంబానికి పరామర్శించి రూ. 2500 వందలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా గ్రామానికి వాటర్ మెన్ గా పని చేశారని గుర్తు చేశారు. లింగం అనారోగ్యంతో మరణించడం చాలా బాధాకరం అన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న లింగం అకస్మాతగా మరణించడం ఆ కుటుంబానికి తీరని లోటు అన్నారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట వడ్డే నాగరాజు, జంగపల్లి స్వామి, అల్వాల నరేష్, వడ్డే ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## ఎస్జిఎఫ్ ఆటలలో విద్యార్థుల నైపుణ్యం

**తొగుట-నవభూమి :**ఎస్జిఎఫ్ ఆటలలో విద్యార్థులు మంచి నైపుణ్యం కనపరిచారని ప్రధానోపాధ్యాయులు నహిమ కౌసర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం ఎస్జి ఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలు వెంకట్రావు పేట ఉన్నత పాఠశాల విద్యార్థులను గెలుపొందిన సందర్భంగా వారిని అభినందించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల పాటు మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. కబ డ్డీ సీనియర్, జూనియర్ బాయ్స్ మొదటి స్థానం, వాలీబాల్ జూనియర్ బాయ్స్ మొదటి స్థానం, కబడ్డీ జూనియర్ గర్ల్స్ ద్వితీయ స్థానం విజయం సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కనక య్య, ఉపాధ్యాయ బృందం గెలుపొందిన విద్యార్థు లను అభినందించారు.



# అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు




**సంగారెడ్డి-నవభూమి :** ఇది తరతరాలకు చెరగని చిరునామా..పక్కాగా ఉంటాం..నమ్మకంగా ప్లాట్ల విక్రయాలు చేస్తామంటూ టీవీల్లో ఊదరకొడుతున్న సువర్ణ భూమి యథేచ్ఛగా చెరువుకుంటను ఆక్రమించింది. సంగారెడ్డి జిల్లా కంది మం డలం చిద్రుప్ప రెవెన్యూ గ్రామం పరిధిలోని బేగంపేట గ్రామ పంచాయతీ పరిధిలో పటాన్‌చెరు-దౌల్తాబాద్ రోడ్డుకు సమీపంలో సువర్ణ భూమి ఓ వెంచర్ ఏర్పాటు చేసింది. ఆ వెంచర్ పూర్తిగా గౌరవగారికుంట 18ఎకరాల విస్తీర్ణంలో ఆక్రమించి మొరం పోసి కుంటను నింపారు. సువర్ణ భూమి ఇన్ ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేసిన వెంచర్‌లో హైదరాబాద్, పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి ప్లాట్లను '(ఒక్కొక్కరికి గుంట చొప్పున) విక్రయాలు చేపట్టారు.గౌరవగారికుంట సర్వే నంబర్ 92లో సుమారు 134 మందికి ప్లాట్లను విక్రయించారు. కొనుగోలు చేసిన భూమిలో ఆన్‌లైన్‌లో ప్లాట్లు చేసి విక్రయాలు చేసి రైతుల భూములకు మాత్రం ఇప్పటికీ డబ్బు లు చెల్లించలేదని ఆందోళన వ్యక్తంచేశారు. అందులో ప్లాట్లు కొనుగోలు చేసే వారికి స్థలం చూపించకుండానే కేవలం మ్యాప్‌లతో రంగురంగుల ఫ్లెక్సీలు, బోర్డులు చూపిస్తూ అమ్మకాలు చేపట్టింది. గుంటల లెక్కన విక్రయాలు చేస్తూ హైదరాబాద్, చుట్టు పక్కల పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికి ఇక్కడి విషయాలు తెలియనీయకుండా జాగ్రత్తలు పాటించి గుంటల లెక్కన అంటగట్టారు.సర్వేనంబర్ 92పూర్తిగా చెరువుకుంటకు సంబంధించిన భూమి. సువర్ణ భూమి యాజమాన్యం రియల్ ముసుగులో కబ్జాలకు పాల్పడుతున్నా సంబంధింత అధికారులు మాత్రం అటువైపుగా కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో అనేక లోసుగులు ఉన్నా అధికారులు చేతివాటానికి అలవాటు పడి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్న సర్వేనంబర్‌కు 92/1 వేస్తూ /1లతోనే19/వన్‌లు వేస్తూ విక్రయాలు జరిపారు. అది పూర్తిగా కుంట భూమి అని తెలిసినా అధికారులు ఎలా వాటిని రిజిస్ట్రేషన్ చేశారో వారికే తెలియాలి మరి.

**అనుమతులు లేకుండానే వెంచర్**

బేగంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సువర్ణభూమి రియల్‌ఎస్టేట్ డెలవపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండానే క్రయ విక్రయాలు చేసింది. రైతుల నుంచి కొంత భూమిని కొనుగోలు చేసి వారికి సగం డబ్బులు ఇచ్చి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నది. మిగతా డబ్బులకు చెక్కులు రాసి ఇచ్చి కాలపరిమితి ముగిసినా వారికి ఇప్పటి వరకు ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి.యథేచ్ఛగా గౌరవగారి కుంటను ఆక్రమించి అనుమతులు లేకుండానే వెంచర్ ఏర్పాటు చేసి గుంటల లెక్కన పూర్తిగా విక్రయించింది. ముఖ్యంగా టీవీల్లో ప్రకటనలు ఇచ్చే సువర్ణభూమి ఇది తరతరాలకు చెరగని చిరునామా అంటూ ఎలాంటి అనుమతులు లేకుండా, రేరా, ఎల్‌పీ నంబర్లు, డీటీసీపీ అప్రూవల్ తీసుకోకుండానే అమ్మకాలు చేస్తూ సామాన్య ప్రజలను మోసాలకు గురిచేస్తున్నది. దీనికి రెవెన్యూ అధికారులు సహకరించి రిజిస్ట్రేషన్లు చేశారు. కుంటను కబ్జా చేసి గుంటల లెక్కన విక్రయించిన సువర్ణభూమి యాజమాన్యంపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**హైడ్రాతో హైరానా**

కుంట శిఖం భూమిలో ప్లాట్లను కొనుగోలు చేసిన వినియోగదారులు హైరానా పడుతున్నట్లు సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లోని చెరువులు, కుంటల శిఖం భూమి, ఎఫ్‌టీఎల్ భూముల్లో నిర్మించిన భవనాలు కూల్చివేయడంతో బేగంపేటలో ప్లాట్లు తీసుకున్న యజమానులు హైడ్రాతో హైరానాకు గురవుతున్నట్లు వినికిడి. చెరువులు, కుంటలను కబ్జా చేసి పూర్తిచేసిన నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేయడంతో శిఖం భూములు తీసుకున్న వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. త్వరలో జిల్లాల వారీగా హైడ్రా తరహా కమిటీలు ఏర్పా టు చేసి అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను నేలమట్టం చేస్తారోనని యాజమానులు మనోవేదనకు గురవుతున్నారు.

**అధికారుల ధనదాహానికి కుంట గోవిందా..**

ప్రభుత్వ అధికార యంత్రాంగానికి పలు సందర్భాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి చెరువులు, కుంటలు, వాగులు, నాలాలు కబ్జాకు గురికాకుండా పర్యవేక్షించాలని ఆదేశించినా ఫలితం శూన్యమనే చెప్పాలి. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూ అధికారుల ధనదాహానికి చిద్రుప్ప రెవెన్యూ గ్రామ పరిధిలోని బేగంపేట గ్రామం గౌరవగారికుంటను సువర్ణ భూమి యథేచ్ఛగా అమ్మేసింది. కేంద్ర ప్రభుత్వం మిషన్ అమృత్ సరోవర్ పథకంలో భాగంగా 29 మే 2022లో గౌరవగారి కుంటలో పూడికతీత పనులను మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో చేపట్టింది.మొత్తం 38 ఎకరాల్లో పూడికతీత పనులు చేపట్టగా సువర్ణ భూమి వెంచర్ యాజమాన్యం అందులో18 ఎకరాల భూమిని ఆక్రమించి గుంటల లెక్కన విక్రయాలు జరిపింది. ఇది పూర్తిగా ప్రభుత్వానిది అని తెలిసినా గుంటల లెక్కన రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్లు చేశారు. సువర్ణ భూమి యాజమాన్యం కుంటలో మొరం పోసి పూడ్చివేసింది. కుంటను ఎలా పూడ్చివేస్తారంటూ గ్రామస్తులు అందోళన చేపడితే మా ఇష్టం మాకు అందరి సహకారం ఉంది.. మీరేం చేసుకుంటారో చేసుకోండని బెదిరింపులకు పాల్పడినట్లు గ్రామస్తులు వెల్లడించారు. సామాన్య ప్రజలు నివాసం ఉండేందుకు చక్కటి ఇల్లు కట్టుకోవాలనే చిన్న ఆశను రియల్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

**మా దృష్టికి రాలేదు**

గౌరవగారి కుంటను చదును చేసిన విషయం మా దృష్టికి రాలేదు. ఇరిగేషన్ అధికారులు, గిర్దావర్లతో విచారణ చేయించి అన్యాక్రాంతమై తే చట్టపరమైన చర్యలు తీసుకుం టాం. రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు భూమిని చూసి చేయరు గదా.. మాకు గ్రామస్తులు, ఇతరులు ఎవరైనా సమాచారం ఇస్తేనే తెలుస్తుం ది. అధికారుల పని రిజిస్ట్రేషన్లు చేయడం వరకే ఉంటుంది. ఇప్పటి వరకు మాకు ఎవరూ ఫిర్యాదు చేయలేకపోవడంతోనే సమాచారం లేదు.

# సమస్యల వలయంలో సర్కారు విద్య

**సిద్దిపేట-నవభూమి :** విద్యారంగానికి పెద్దపీట వేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక ఆ దిశగా కృషిచేయడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఎంతగానో కృషి చేసింది.'మనఊరు-మన బడి' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు సరిగా లేకపోవడంతో పాటు ఉపాధ్యాయుల కొరతతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు.సిద్దిపేట జిల్లాలో మొత్తం 980 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇం దులో 640 ప్రాథమిక పాఠశాలలు, 113 ప్రా థమికోన్నత పాఠశాలలు, 227 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమా రు 80 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. సిద్దిపేట జిల్లాలో 86 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సున్నా ఉండడం గమనా ర్హం. ప్రభుత్వ పాఠశాల్లలో సరైన సౌకర్యాలు, ఉపాధ్యాయులు లేకపోవడంతో గతేడాది కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గింది. మరోవైపు సమయానికి పాఠశాల నిర్వహణ నిధులు రాక ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బదిలీ అయినా 170 మంది పాత పాఠశాలల్లోనే..సిద్దిపేట జిల్లాలో మొత్తం 4,092 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో 2,157 మంది స్కూల్ అసిస్టెంట్లు, 1935 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో జిల్లాలో 1,036 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారందరినీ బదిలీ చేసినప్పటికీ ఇంకా 170 మంది ఉపాధ్యాయులు ఇంకా అదే పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. కొంత మంది ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ అధికారులు రిలీవ్ చేయకపోవడంతో బదిలీ అయినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. వీరందరినీ డీఎస్సీ రిక్రూట్‌మెంట్ అయిపోయిన తర్వాతనే రిలీవ్ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. సిద్దిపేట జిల్లాలో 724 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉండగా.. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పూర్తయిన తర్వాతనే కొత్త వారిని బదిలీ అయిన పాత స్థానంలోకి పంపి,పాత వారిని రిలీవ్ చేస్తారని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.



## హానికరమైన చెత్తను వేరు చేయాలి



హుస్నాబాద్-నవభూమి : ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్త తోపాటు హానికరమైన చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత అన్నారు. ఆదివారం ఉదయం హుస్నాబాద్ పట్టణంలో మార్నింగ్ వాకర్స్, యోగ సభ్యులకు స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. యోగ సభ్యులు, వాకర్స్, స్విమ్మర్ సభ్యులతో కలిసి స్వచ్ఛత పై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, వారంలో రెండు రోజులు శ్రమ దాన కార్యక్రమాలు చేయాలని సూచించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను నిషేధించాలని, ప్లాస్టిక్ వాడడం వల్ల కాలుష్యం పెరిగి పర్యావరణం నాశనం అవుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్లు బదులు జ్యూట్ బ్యాగులను వాడాలని, పట్టణ ప్రజలందరూ కూడా స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొని హుస్నాబాద్ పట్టణాన్ని స్వచ్ఛతలో ముందు ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ అనిత, కౌన్సిలర్ లు బోజు రమాదేవి, పున్న సది లావణ్య, భాగ్య రెడ్డి , వాల సుప్రజ , పర్యావరణ అధికారి రవికుమార్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సంపత్, బొలిశెట్టి సుధాకర్, కొమురయ్య, దర్మవీర్ యోగ శిక్షణ సభ్యులు పాల్గొన్నారు.

## ఎనిమిది నెలల్లో హుస్నాబాద్‌కు రూ. 900 కోట్లు

హుస్నాబాద్-నవభూమి :హుస్నాబాద్ నియోజకవర్గానికి మంత్రి పొన్నం ప్రభాకర్ 8 నెలల కాలంలో దాదాపు రూ.900 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చారని , అభివృద్ధి చూసి ఓర్వలేకుని మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మంత్రిపై ఆరోపణలు చేస్తున్నారని హుస్నాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు విమర్శించారు. ఆదివారం హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ ఖాళీ అవుతుందనే భయంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కు భయం పట్టుకుందన్నారు. అసెంబ్లీలో హుస్నాబాద్ గళం వినిపిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ అనునిత్యం హుస్నాబాద్ అభివృద్ధి దేహంగా పనిచేస్తున్న నాయకుడన్నారు. కాంగ్రెస్ అంటేనే ప్రజా ప్రభుత్వం ప్రజా పరిపాలన వైపుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పది సంవత్సరాలు అధికారాంలో వుండి ఫ్లవర్ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు ఒక సీటు కూడా రాదేమో అని మాజీ ఎమ్మెల్యే కు నిద్ర పట్టడం లేదేమో అన్నారు. మన నియోజకవర్గానికి మొదటిసారి ఎమ్మెల్యే బీసీ నేత మంత్రి అవడం చూసి తట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు పనుల కోసం రూ.140 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. హుస్నాబాద్ మున్సిపల్ అభివృద్ధికి రూ.35 కోట్లు, ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి రూ.18 కోట్లు, సర్వాయి పేట పర్యాటకానికి రూ. 4.70 కోట్లు, ట్రైబల్ తండ సీసీ రోడ్లకు రూ.10 కోట్లు, కొత్త రోడ్ల కోసం రూ.50 కోట్లు, రోడ్స్ మెయింటేన్స్ 10 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల నిర్మాణం కోసం రూ 431 కోట్లు తీసుకొచ్చారన్నారు. మరోవైపు ఇప్పటికే మంజూరు చేయాల్సిన దానిలో మహ సముద్రం కోసం రూ.10 కోట్లు, రాయికల్ వాటర్ ఫాల్స్ కోసం రూ.10 కోట్లు, 4 లైన్స్ ఎక్స్ టెన్షన్ కోసం రూ. 163 కోట్లు, ఎల్లమ్మ చేరవు బ్యూటిఫికేశన్ కోసం రూ. 17 కోట్లు నిధులు వచ్చాయన్నారు. జాబ్ మేళా ద్వారా 5 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఓడితల సతీష్ కుమార్ ఈ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో చేయలేనిది మంత్రి కొద్ది నెలల్లోనే అభివృద్ధి చేయడంతో రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందనే భయం పట్టుకుందాన్నారు. ఈ కార్యక్రమంలో కంది తిరుపతిరెడ్డి. హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ లు వల్లపు రాజు, కోమటి స్వర్ణలత బూరుగు కృష్ణస్వామి,



# ప్రజలపై పడనున్న భారం

హుస్నాబాద్-నవభూమి : ప్రజలపై పన్నుల భారాన్ని మోపేందుకు కాంగ్రెస్ సర్కారు పలు రకాల చర్యలకు శ్రీకారం చుట్టింది. ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రజలపై పన్నులు వేసేందుకు ప్రభుత్వం పాత చట్టాల బూజు దులుపుమని ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయా మున్సిపల్ శాఖ అధికారులు ప్రజల నుంచి ఎలా పన్నులు రాబట్టాలనే దానిపై దృష్టిసారించడమే కాకుండా ఆయా పన్నులు చెల్లించాలంటూ నోటీసులు సైతం జారీచేస్తున్నారు.ప్రజల ఇండ్లు, దుకాణాలు, ట్రేడ్ లైసెన్సులు, ఇంటి నిర్మాణాలు, నల్లా పన్నుల వసూళ్లు చేపడుతున్న మున్సిపల్ శాఖ అధికారులు, తాజాగా ఆదాయం కోసం ప్రజలపై మరింత పన్నుల భారాన్ని మోపుతున్నారు. ఇప్పటికే ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారికి ల్యాండ్ రెగ్యులరైజ్ పేరిట ఆదాయాన్ని సమకూర్చాలంటూ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేయగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. తాజాగా వీఎల్‌టీ పేరిట పన్నులు వేసేందుకు సిద్ధమైంది.




**వీఎల్‌టీ పేరిట నోటీసుల జారీ**

హుస్నాబాద్ పట్టణంలో ప్లాట్లుగా మారిన ఖాళీ స్థలాలను గుర్తించడంతో పాటు ఇందుకు సంబంధించిన యజమానులకు వీఎల్‌టీ పేరిట(వెకేట్ ల్యాండ్ ట్యాక్స్) నోటీసులు సైతం మున్సిపల్ జారీచేస్తున్నది. పట్టణంలోని ఇరవై వార్డుల్లో 471 ఖాళీస్థలాలు ఉన్నాయని మున్సిపల్ అధికారులు తాత్కాలికంగా గుర్తించారు. ఈ ఖాళీ స్థలాల యజమానులకు సైతం వీఎల్‌టీ నంబర్లు తీసుకోవాలంటూ వార్డు అధికారులు సదరు యజమానులకు నోటీసులు జారీచేస్తున్నారు.ఖాళీ స్థలాలకు ఇంటినంబర్లు ఇస్తామంటూ వివరిస్తూ నోటీసులు అందజేస్తున్నారు. ఆయా ఏరియాలో మార్కెట్ వాల్యు ప్రకారం ఇంటి స్థలాలకు ఏ విధంగా పన్ను వేస్తున్నారో, అలానే ఈ వీఎల్‌టీ పన్ను సైతం ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వీఎల్‌టీ పన్ను చెల్లించని పక్షంలో ఆ స్థలం యజమానులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. భూమిపత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని తక్షణమే ఇంటినంబర్ సైతం కేటాయిస్తామని అధికారులు వివరిస్తూ ప్రజలనుంచి ముక్కుపిండి పన్నులు వసూలుచేసే పనిలో పడ్డారు.

**చెల్లించకుంటే చర్యలు..**

పట్టణంలో ఏఏ వాడల్లో ఎన్ని ఖాళీస్థలాలు ఉన్నాయనే విషయాన్ని ప్రాథమికంగా గుర్తించాం. ఇప్పటికే పలువురికి పన్ను చెల్లించి నంబర్ పొందాలని నోటీసులు జారీచే శాం. పన్నులు చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలకు వారి స్థలాలపై హక్కులు సైతం ఉండేందుకు వీఎల్‌టీ ఉపయోగపడుతుంది.

# కళ తప్పిన చెకువులు..

రంగారెడ్డి-నవభూమి : కేసీఆర్ హయాంలో మారినచెరువుల రూపురేఖలు..అంతరించిపోతున్న జల వనరులను మళ్లీ పునరుద్ధరించాలన్న సదుద్దేశంతో కేసీఆర్ చేపట్టిన మిషన్ కాకతీయ పథకంతో జిల్లాలోని చెరువుల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. కాకతీయ రాజుల పాలనలో కళకళలాడిన గొలుసుకట్టు చెరువులు దశాబ్దాల కాలం తర్వాత కేసీఆర్ పాలనలో మళ్లీ జలకళను సంతరించుకున్నాయి. జిల్లాలో ఉన్న 999 చెరువులకు మిషన్ కాకతీయ పథకం కింద పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతులను మంజూరు చేసింది.నాలుగు విడతల్లో ఈ పథకం కింద రూ.132.95 కోట్ల వరకు నిధులను వెచ్చించి 956 చెరువులను బాగు చేసింది. కట్టలపై ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించారు. తూములకు మరమ్మతులు చేపట్టారు. చెరువు అంతర్భాగంలో పేరుకుపోయిన పూడికనూ తొలగించారు. గత ప్రభుత్వ చర్యలతో చెరువులు పటిష్టంగా మారి భారీ వర్షాలకు సైతం చెక్కుచెదరలేదు. కానీ ఏడాదిలోనే చెరువులు కళను కోల్పోయాయి.గత బీఆర్ఎస్ హయాంలో నీటితో కళకళలాడిన చెరువులు అడుగంటి దయనీయంగా మారాయి. వానకాలం సాగుకు రైతు భరోసా లేక, రుణాలు అందక జిల్లా రైతాంగం ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నది. ఈ పరిస్థితుల్లోనే చెరువుల్లో నీళ్లు అం తంత మాత్రంగానే ఉండడంతో రైతులకు సాగునీటి కష్టాలు సైతం మొదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. జిల్లాలో చాలావరకు రైతాంగం బోరు, బావులపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నది. భూగర్భజలాలు అంతంతమాత్రంగానే ఉండ డంతో బోర్లలో నీళ్లు తగ్గిపోనున్నాయి.అటు బోర్లలోనూ నీళ్లు లేక, ఇటు చెరువులు అడుగంటి రానున్న రోజుల్లో సాగు నీటి కష్టాలు తీవ్రతరమయ్యే అవకాశం ఉందని రైతులు ఇప్పటినుంచే ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను ప్రతియేటా వదలడంతో మత్స్యకారులు ఉపాధి పొం దుతూ సంతోషంగా గడిపారు.అయితే ఈసారి చెరువుల్లో అంతంత మాత్రంగానే నీటి నిల్వలు ఉండడం..ఇప్పటివరకు చెరువుల్లోకి చేప పిల్లలను వదలకపోవడంతో మత్స్యకార్మికులు సైతం ఆందోళన చెందుతున్నారు. మిషన్ కాకతీయ చెరువులకు ఆదరువు లేకపోవడంతో రాబోవు రోజుల్లో పశు పక్షాదులకు సైతం నీటి ఇక్కట్లు తప్పేలా లేవు.

**చెరువుల పటిష్టతకు చర్యలేవీ..**

కాంగ్రెస్ ప్రభుత్వం చెరువుల పటిష్టతకు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో జిల్లాలో చెరువుల ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలం ప్రారంభానికి ముందే అవసరమైన పనులను చేపట్టాల్సి ఉండగా.. ఈ ప్రక్రియను ఇప్పటికీ చేపట్టలేదు. తట్టెడు పూడిక సైతం తీయలేదు. పర్యవేక్షణ కరువై చెరువు కట్టలపై కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.ఒకప్పుడు జీవధారగా ఉన్న గొలుసుకట్టు చెరువు లు వైభవాన్ని కోల్పోతున్నాయి. వేల ఎకరాలకు సాగునీరు అందించిన వనరులు కళ తప్పి ఆదరణ కోల్పోతున్నాయి. కొన్ని పూడిపోయాయి. ఇంకొన్ని ఆక్రమణల్లో కలిసిపోయాయి. మరికొన్ని ఉన్నా.. లేనట్టే అయ్యాయి. ఒకప్పుడు విశాలంగా ఉన్న చెరువులు కాస్తా.. కాలక్రమంలో నీటి గుంటల్లా మిగిలాయి. ఉన్న ఆ కొద్ది పాటి వనరుల్లోకి వర్షాకాలంలో నీళ్లొచ్చినా నిల్వ ఉండేది కొన్ని రోజులే అన్నట్లుగా మారాయి.



## విమర్శలు మానుకోకపోతే గుణపాఠం తప్పదు

**చేర్యాల-నవభూమి** : చిల్లర రాజకీయాలు చేస్తూ సీపీఎం నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకోకపోతే గుణపాఠం తప్పదని చేర్యాల మాజీ జడ్పీటీసీ దాసరి కళావతి హెచ్చరించారు. చేర్యాల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదవిలో ఉన్నా, లేకపోయినా నిస్వార్థంగా నియోజకవర్గ అభివృద్ధికి కొమ్మూరి ప్రతాపరెడ్డి పాటుపడుతూ, ప్రజాదరణ పొందడం ఓర్వలేక నిరాశ, నిస్పృహలకులోనవుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేసుకోవాలని పేర్కొన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను గాలికి వదిలివేసి దిగజారుడుతనానికి పాల్పడడంలో తనకుతానే సాటి అని విమర్శించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, ముస్త్యాల తార, మార్కెట్ డైరెక్టర్ తడక లింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ మండల కార్యదర్శి సనాది భాస్కర్, మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, భిక్షపతి, కనకరాజు, మల్లం బాలయ్య, బత్తిని నర్సింహులు, కాయిత మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం సిద్ధం



**నల్లగొండ-నవభూమి** :ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని సాగు నీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రాబోయే మూడేండ్లల్లోనే ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఎల్ఎల్‌బీసీ టన్నెల్ పనులపై ప్రత్యేక సమీక్ష చేస్తూ నెలనెలా నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు. 2027 సెప్టెంబర్ నాటికి సొరంగ మార్గాన్ని పూర్తి చేయాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నారు.నకలగండి, ఉదయ సముద్రం బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులకు ప్రాధాన్యతా క్రమంలో నిధులు విడుదల చేస్తామని చెప్పారు. శుక్రవారం ఎల్ఎల్‌బీసీ టన్నెల్‌ను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో బట్టి విక్రమార్క, మండలి చైర్మన్ గుత్తా, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు పరిశీలించారు. టన్నెల్‌లో ప్రయాణించి పనుల పురోగతిపై ఆరా తీశారు.అనంతరం మన్నెవారిపల్లి క్యాంపులో సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్, ట్రాన్స్‌కో రాష్ట్ర ఉన్నతాధికారులతోపాటు ఉమ్మడి జిల్లాల అధికారులు హాజరయ్యారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వం వహిస్తూ ప్రాజెక్టుల వారీగా అధికారులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇప్పించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, ప్రాధాన్యతలను ఇరిగేషన్ సీఈ అజయ్‌కుమార్ వివరించారు. మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## తొమ్మిది నెలల్లో.. నయాపైసా రాలె!

**సూర్యాపేట-నవభూమి** : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నెలనెలా పట్టణ ప్రగతి నిధులతోపాటు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు నిధుల వరద పారింది. కేసీఆర్ సర్కారు ఉన్న తొమ్మిదిన్నరేండ్లలో జిల్లాలోని మున్సిపాలిటీలకు దాదాపు 50వేల కోట్లు నిధులు వచ్చాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో మాత్రం వేతనాలు, విద్యుత్ బిల్లులు, వాహనాల డీజిల్‌కే కష్టమవుతున్నది. గత తొమ్మిది నెలల్లో సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటీలకు నయాపైసా నిధులు విడుదల కాకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు జిల్లా కేంద్రానికి వచ్చి అన్ని శాఖలతో ఒక్క రివ్యూ కూడా పెట్టని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్, ఆయన సతీమణి పద్మావతి ఎమ్మెల్యేగా కోదాడ నియోజకవర్గాలకు మాత్రమే మంత్రిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలకు కోట్లాది రూపాయలు ఇస్తుండగా సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటీలను కనీసం పట్టించుకోవడం లేదు.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

**కడ్తాల్-నవభూమి** : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కడ్తాల్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-68వ క్రీడా పోటీలను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులచే ఎమ్మెల్యే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తున్నదని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించాలన్నారు.జోనల్ కార్యదర్శి భీముడునాయక్ మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు అండర్-14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆయన వివరించారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మాధవి, డీసీసీబీ




డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, ఎంఈవో నాయక్, హెచ్ఎం జంగయ్య, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, జోనల్ సెక్రటరీ భీముడునాయక్, పీడీలు, విద్యార్థులున్నారు.

# ఉపాధి పనులు భేష్

**ఇబ్రహీంపట్నం-నవభూమి** : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు బేషుగ్గా ఉన్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి అనిల్ కితాబిచ్చారు. శనివారం ఆయన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్‌తో కలిసి మండలంలోని రాయపోలు గ్రామంలో పర్యటించి.. జరిగిన పనులను పరిశీలించారు.గ్రామంలో పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడుతూ.. సక్రమంగా పని కల్పిస్తున్నారా..? సరిగ్గా డబ్బులు చెల్లిస్తున్నారా..? తాగు నీరు, నీడ, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచుతున్నారా.. అని అడుగగా.. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని వారు చెప్పడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కూలీల హాజరును రోజువారీగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఏ విధంగా తీసుకుంటున్నారో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన స్వచ్ఛ త హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కను నాటి నీరు పోశారు.పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించాలని, గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, స్పెషల్ కమిషనర్ శఫీఉల్లా, జాయింట్ కమిషనర్ నర్సింహులు, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారిణి శ్రీలత, ఏపీడీలు సక్రియానాయక్,



చరణ్‌గౌతమ్, సీఆర్‌డీ ప్రోగ్రాం ఆఫీసర్లు మురళి, కృష్ణమూర్తి, అంబేద్‌ఖాన్, ఎంపీడీవో వెంకటమ్మ, ఏపీవో తిరుపతిచారి, ఈసీ రవికుమార్, టీఏ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అలివేలు, ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ఉచిత చేప పిల్లలు ఈసారి సగమే..

**నల్లగొండ-నవభూమి** : నీలి విప్లవంలో భాగంగా ఏడేండ్ల పాటు కేసీఆర్ సర్కారు వంద శాతం సబ్సిడీతో పంపిణీ చేసిన చేప పిల్లల సంఖ్యను కాంగ్రెస్ ప్రభుత్వం సగానికి తగ్గించింది. నల్లగొండ జిల్లాకు సంబంధించి 2016-17 నుంచి 2022-23 వరకు ఏటా 6 కోట్ల చేప పిల్లలను సరఫరా చేయగా, ఈసారి 3 కోట్లకు మాత్రమే టెండర్లు స్వీకరించింది. ఈ నెల 19న ఈ ప్రక్రియ పూర్తవడంతో త్వరలోనే ఫైనల్ చేసి వచ్చే నెల నుండి చెరువుల్లో సీడ్ పోయనున్నది. చేప పిల్లల సంఖ్య సగానికి తగ్గడంతో ఈసారి చిన్న చెరువులను మినహాయించి పెద్ద చెరువులు, రిజర్వాయర్లలోనే వదిలే అవకాశం ఉంది.

**మత్స్యకారులకు అరకొర ప్రయోజనమే..**

జిల్లావ్యాప్తంగా 227 మత్స్య సహకార సొసైటీలు ఉండగా ఆయా సొసైటీల్లో 25 254 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 24 మహిళా సొసైటీలు ఉన్నాయి. ఈ సభ్యులు జిల్లాలోని 9 జలాశయాలు, 1,399 చెరువుల్లో చేపలు పట్టి వాటిని స్థానికంగా, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి ఏటా రూ.400 కోట్ల వ్యాపారం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ సర్కారు ప్రోత్సాహంతో ఏడేండ్లుగా మత్స్యకారులు ఉపాధి మెరుగు పడింది.కొర్రమీను, బొచ్చ, రవ్వ, పాంప్లెంట్, జల్ల, బురక, చందమామ, ఆలుగ, బురద మట్ట వంటి చేపలను చేపలను పెంచి ఇక్కడి అవసరాలు తీరాక ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, డిల్లీ, కర్నాటక రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ఈసారి సగం పిల్లలను వదిలే అవకాశం ఉండడంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి కష్టం కానుంది. మత్స్యకారుల ఉపాధిపైనా తీవ్ర ప్రభావం పడనున్నది.

**బీఆర్ఎస్ పాలనలో ఏడేండ్లుగా ఏటా ఆరు కోట్ల చేప పిల్లల విడుదల**

2014కు ముందు జిల్లావాసులు చేపలు తినాలంటే పొరుగున ఉన్న ఆంధ్రా లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే చేపలే దొరికేవి. 2016-17 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో ఏటా రూ.5.50 కోట్లు వెచ్చించి నల్లగొండ జిల్లాలోని నీటి వనరుల్లో 6 కోట్ల చేప పిల్లలను వదులుతూ వచ్చింది. ఇందుకోసం ఏడేండ్లలో రూ.29.27 కోట్లు ఖర్చు చేసింది. ఏటా రిజర్వాయర్లల్లో రొయ్య పిల్లలను కూడా విడుదల చేసేది. తద్వారా మత్స్యకారులకు కూడా చేతినిండా పని దొరికింది.నీలి విప్లవం కింద పలు చెరువుల నిర్మాణం..నీలి విప్లవంలో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృత్రిమ చెరువుల నిర్మాణాలను కూడా ప్రోత్సహించింది. 2017-18 నుంచి 2020-21 వరకు ప్రభుత్వం 60శాతం సబ్సిడీతో మహిళా మత్స్యకారులతో పాటు ఎస్సీ, ఎస్టీలకు చెరువుల నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. జిల్లాలో 55 మంది మత్స్యకారులు చేపల చెరువులు నిర్మించుకునేందుకు రూ.3.32 కోట్ల సబ్సిడీ ఇచ్చింది. సీడ్ ఉత్పత్తికి సంబంధించిన చెరువుల నిర్మాణానికి 37 మందికి మరో 1.84 కోట్ల సబ్సిడీ అందజేసింది. చేప సీడ్ హాచరీస్, రీసర్క్యులేటెడ్ ఆక్వా కల్చర్ పద్ధతి, పంజరంలో చేపలు పెంచడాని రూ.10కోట్లు సబ్సిడీ రూపంలో ఇచ్చింది. చేపలు అమ్మడానికి, చేపలు పట్టే సామగ్రికి, రవాణా వాహనాలకు 60 నుంచి 90శాతం సబ్సిడీతో ఏడేండ్లల్లో 7 వేల మందికి రూ.42కోట్ల సబ్సిడీని అందించింది.

